# నాయన

1

ఇది చితికిన భూమి

నాయనా...

నువ్విచ్చిన చెమటల కన్నీరూ

చెమర్చిన గుండెకాయ

పెను నిశ్శబ్దం

అబద్దాల గావురు కాంతి

2

సగం రాత్రిలో

నువ్ సగమిచ్చిన భయాలు

సగమే పెగిలిన నవ్వులు

నాయనా...

నువ్వేనే

అంతా నీ ఇంటి కప్పుకిందనే

3

ఇది మండుతున్న పొయ్యి

నెత్తురు కుండ

...తాగిన గడియారం

మమ్మన్ని దింపిన నరకమే నాయనా

...నగరమే

4

ఇటుకలూ సున్నం పొడిగా

రాలిన నీ ఇల్లు దేహం

ఎటో చూసి నువ్విచ్చిన చూపుతో

కూలిన చెట్టూ

ఇంటి అడుగున తవ్వితే...

దొరికిన డొల్ల తేనె తుట్టె

5

ఇవతలి తీరంలో నన్నొదిలి పోయినావా

అమ్మ వూపిరి పొదిలో ఇటుకలు పేరుస్తున్నావా

నాయనా

ఇది నిజంగా పగిలిన డప్పు

విరిగిన వాయులీనం

నీ ఇల్లేనే...

6

పిడికెడు సుఖదుఃఖాల్ని

... ... పరం చేసిన వాడా

రేపు నా కొడుకులు కూల్చే పునాదుల్లో

నీలాగా పలకరించగలనా

వో తరం దుఃఖమెపుడూ

... ... తరాంతర శేషమేనా

నువ్ నిమిరిన కల్వమొక్కలూ వానచుక్కలూ

మొలకలెత్తుతాయా

నాయనా...

ఈ కోటిన్నొక్క పాదాల నలిగే లక్షన్నొక వాక్యాన్ని

సిద్ధార్థ

(బొమ్మలబాయి – 11.03.1995)